క్లుప్తంగా

బాలికలపై ప్రత్యేక దృష్టి


బాలికల హాస్టల్ వద్ద పిల్లలతో డాక్టర్ సంధ్య

గుడిపాల: బాలికలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు గుడిపాల ప్రాథమిక వైద్యాధికారి సంధ్య తెలిపారు. మండల కేంద్రంలో ఉన్న బాలికల వసతి గృహంలో శనివారం పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. హాస్టల్లో వంటగది, పిల్లలు నిద్రించే గది, బాత్రూంలను పరిశీలించి పరిసరాలన్నింటినీ శుభ్రంగా ఉంచుకోవాలని వారికి తెలియజేశారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బాల సూర్యనారాయణ, ఏఎన్ఎం జబసెల్వి, ఎంఎల్‌హెచ్‌పి ఉమామహేశ్వరి, ఆశావర్కర్లు సుజిమ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



తవణంపల్లె: మండలంలోని మిట్టపల్లెలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైదేహి సూపర్ స్పెషాలిటి హాస్పిటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ లోకేష్‌బరానితో పలువురు వైద్యులు రోగులకు పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. మిట్టపల్లె పరిసర గ్రామాల ప్రజలు వైద్యం చేయించుకున్నారు.

మండల మీట్ వాయిదా

ఐరాల: కోరం లేక మండల సర్వసభ్య సమావేశం వాయిదా వేసినట్లు ఎంపీడీఓ ధనలక్ష్మి తెలిపారు. శనివారం ఉదయం 10.30 గంటలకు సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి అధికారులు మాత్రమే హాజరయ్యారు. మండల ఎంపీటీసీ సభ్యులు హాజరుకాకపోవడంతో సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు. 2.30 గంటల వరకు కూడా సభ్యులు హాజరుకాకపోవడంతో మండల సర్వసభ్య సమావేశం నిరవధికంగా వాయిదా వేసినట్లు ఆమె వెల్లడించారు.

ఆంగ్లభాషపై పట్టు ముఖ్యం


శిక్షణలో పాల్గొన్న కళాశాల విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులకు ఆంగ్లభాషపై పట్టు ముఖ్యమని సీవీఎస్ కళాశాల కరస్పాండెంట్ వెంకట్‌నాయుడు అన్నారు. నగరంలోని కొత్తబస్టాండ్ వద్ద ఉన్న ఆ కళాశాలలో శనివారం యూఎస్ఎక్స్‌టీ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆంగ్లభాష లోని మెలకువలను తెలుసుకోవాలన్నారు. చేంజ్ మేకర్ హబీబ్, కరస్పాండెంట్ సురేఖ పాల్గొన్నారు.

గజ బీభత్సం

యాదమరి: మండలంలో ఏనుగులు బీభత్సం సృష్టిస్తున్నాయి. తాజాగా శుక్రవారం అర్ధరాత్రి సమయంలో పెరగాండ్లపల్లె, రాచూరు అటవీ బీట్ పరిధిలోని పంటలను ధ్వంసం చేశాయి. రైతులు వరదారాజులు,జగన్నాథం,రామ్మూర్తికి చెందిన వరి,మామిడి,అరటి పంటలపై నాశనం చేశాయి. రాచూరు అటవీ బీట్ పరిధిలో దాదాపు 23 ఏనుగుల గుంపు సంచరిస్తోందని స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఏనుగుల బెడద నుంచి రక్షించాలని రైతులు వేడుకుంటున్నారు.

మా భూములు లాక్కున్నారు

తవణంపల్లె: అమరరాజ ట్రస్టు పేరుతో మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, అమరరాజ బ్యాటరీస్ అధినేత రామచంద్రనాయుడు దౌర్జన్యంగా మా భూములు లాక్కున్నారని దిగువ మాఘంకు చెందిన రైతులు గోపీకృష్ణ, డాక్టర్ వైవీ హరీష్‌చంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రం తవణంపల్లె ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. అరుణకుమారి కుటుంబ సభ్యులు మా తాతల కాలం నుంచి అనుభవిస్తున్న తమ భూములను ఆక్రమించుకొని భవనాలు నిర్మించుకొన్నారని జిల్లా అధికారులకు విన్నవించినా పట్టించుకొనే వారు లేరని కంట తడిపెట్టారు. భూస్వాములతో కోర్టులో పోరాడలేక పోతున్నామని అధికారులే తమ న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఎండలు.. వ్యాధులు

అతిసార

అతిసార(నీళ్ల విరేచనాలు) వ్యాధి పట్ల వేసవిలో అప్రమత్తంగా ఉండాలి. కలుషిత నీరు, ఆహారం తీసుకోవడం వల్ల వ్యాధి బారిన పడుతుంటారు. ఈ వ్యాధి బారిన పడిన వారిలో కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు, బరువు తగ్గడం, శరీరంలో నీటి శాతాన్ని కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఎక్కువగా విరేచనాలు అవ్వడం వల్ల రోగులు నీరసించిపోతారు. ఈ వ్యాధి వల్ల పిల్లలు, వృద్ధులకు చాలా ఇబ్బంది. సకాలంలో స్పందించకపోతే ప్రాణాలకే ప్రమాదం. నిల్వ ఆహార పదార్థాలను తీసుకోకూడదు. పరిశుభ్రమైన నీటిని తీసుకోవాలి. ఎలక్ట్రోల్ పౌడర్‌తో నీటిశాతం, లవణాలు పెంచుకోవచ్చు.

చికెన్‌పాక్స్(ఆటలమ్మ)



ఈ వ్యాధి కారక వైరస్‌కు వేసవికాలం అనుకూలంగా ఉంటుంది. ఇది అంటువ్యాధి. వ్యాధి బారిన పడిన వారిలో తీవ్ర జ్వరం ఉంటుంది. శరీరంపై నల్లని మచ్చలు వస్తాయి. అలసట, ఒంటిపై బుడగలు తేలడం, తలనొప్పి, దురద, ఆకలి తగ్గడం వ్యాధి లక్షణాలు. వ్యాధి నయం కావడానికి కనీసం పదిరోజులు సమయం పడుతుంది. వ్యాధిగ్రస్తులు పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలి. అంటువ్యాధి కావడం వల్ల వ్యాధిగ్రస్తులకు వీలైనంత దూరంగా ఉండడం మంచిది.



- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- కలుషిత నీరు, ఆహారంతో వ్యాధుల ముప్పు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు

గుడిపాల: మండలంలో పగటిపూట ఎండల తీవ్రత ఒక్కసారిగా పెరిగిపోయింది. మునుపెన్నడూ లేని విధంగా మార్చిలోనే పగటి ఉష్ణోగ్రతలు ప్రజలను ఉక్కిరి, బిక్కిరి చేస్తున్నాయి. ఉదయం 9 గంటలకే భానుడి భగభగలు మొదలవుతుండడంతో ఎండలో బయటికి వెళ్లాలంటే ప్రజలు హడలిపోతున్నారు. ప్రయాణాలు చేసేవారు, వ్యవసాయ, ఇతర పనులు చేసేవారు ఇబ్బంది పడుతున్నారు. ఎండలో ఎక్కువగా తిరిగితే వ్యాధులు దాడి చేసే అవకాశముంది. వర్షాకాలంలో ఎలా అయితే అంటువ్యాధులు విజృంభిస్తాయో, వేసవిలో వేడిమి వల్ల కలుషిత నీరు, ఆహారం వల్ల వ్యాధులు సోకుతాయి. వేసవిలో ఎద్దడి కారణంగా నీరు కలుషితమయ్యే అవకాశాలు ఎక్కువ. ఆహారం కూడా త్వరగా పాడై పోతుంది. కలుషిత నీరు, ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల ఎక్కువ శాతం మంది వ్యాధుల బారిన పడుతుంటారు. వేసవిలో కూడా వైరస్, బ్యాక్టీరియల్ వ్యాధుల ముప్పు పొంచి ఉంటుందని ముందస్తు జాగ్రత్తలు పాటించకపోతే ప్రమాదమేనని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

వడదెబ్బ

తీవ్రమైన ఎండవేడిమి వల్ల శరీరంలో ఉష్ణోగ్రతను నియంత్రించే వ్యవస్థ దెబ్బతింటుంది. ఎలక్ట్రోలైట్స్, మినరల్స్, నీటిశాతం తగ్గి సత్తువలేని స్థితికి చేరడాన్నే వడదెబ్బ అంటారు. శరీర ఉష్ణోగ్రత పెరగడం, చెమట పట్టడం, గుండె వేగంగా కొట్టుకోవడం, కండరాళ్లు గట్టిపడడం, చర్మం ఎర్రగా మారడం, వాంతులు అవ్వడం, మూర్ఛరావడం, తలనొప్పి, కోమాలోకి వెళ్లడం లాంటి లక్షణాలు వడదెబ్బ సోకిన వారిలో కనిపిస్తాయి.



పచ్చకామెర్లు

వేసవిలో వచ్చే పచ్చకామెర్లు చాలా ప్రమాదకరం. ప్రాణాలు తీసేందుకు కూడా వెనుకాడని ఈ పచ్చకామెర్ల వ్యాధి కలుషిత నీటి వల్ల, అతి సూక్ష్మమైన క్రిముల వల్ల సోకుతుంది. దీన్ని హైపటైటిస్- ఏ అని కూడా అంటారు. చర్మం పచ్చబడడం, మూత్రం పచ్చగా మారడం, చర్మంపై దురద, ఆకలి మందగించడం, జ్వరం, తలనొప్పి, ఒళ్లునొప్పులు, తెల్లని మలం రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. శుభ్రమైన నీటిని తాగాలి. వంటల్లో నూనె బాగా తగ్గించాలి.



టైఫాయిడ్

అపరిశుభ్రమైన నీరు, ఆహారం తీసుకోవడం వల్ల టైఫాయిడ్ జ్వరం వస్తుంది. అతి జ్వరం, అలసట, నిస్సత్తువ, కడుపునొప్పి తలనొప్పి, ఆకలి లేకపోవడం వ్యాధి లక్షణాలు. శుభ్రమైన మంచినీటిని, ఆహారాన్ని తీసుకోవాలి. వైద్యుడిని సంప్రదించి మందులను వాడాలి.

మలేరియా

ఆడ అనాఫిలిస్ దోమకాటుతో మలేరియా వ్యాపిస్తుంది. అధిక చలి, తలనొప్పి, వాంతులు, జ్వరం, అధిక రక్తపోటు, చెమట పట్టడం, నీరసం వంటి లక్షణాలు కనిపిస్తాయి. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అన్ని వేళలా మితాహారం మంచిది.

డెంగ్యూ

ఇది కూడా దోమకాటు వల్ల ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంది. ఈ వ్యాధి రెండు దశల్లో ఉంటుంది. అధిక జ్వరం, తలనొప్పి, కండరాలు, కీళ్ల నొప్పులు తీవ్రంగా ఉంటాయి. పగటి పూట కుట్టే దోమల నుంచి జాగ్రత్తలు పాటించాలి. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి.

గవద బిళ్లలు

వైరస్ కారణంగా వచ్చే ఈ అంటువ్యాధి పిల్లల్లో ఎక్కువగా కనిపిస్తుంది. లాలాజల గ్రంథులకు వాపురావడం, జ్వరం, తలనొప్పి, ఒళ్లునొప్పులు, అలసట, ఆకలి లేకపోవడం ఈ వ్యాధి లక్షణాలు. వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు ముందస్తుగా ఎంఎంఆర్ వ్యాక్సిన్ వేయించుకోవడం మంచిది.

మీజిల్స్(తట్టు)

ఈ వ్యాధి వేసవిలో ఎండలు ఎక్కువగా ఉన్న సమయంలో చిన్న పిల్లలకు వస్తుంది. పారామిక్స్ వైరస్ కారణంగా వ్యాధి సంక్రమిస్తోంది. గొంతువెనక భాగంలో ఒక పొరలా ఏర్పడుతుంది. తీవ్రమైన జ్వరం, దగ్గు, జలుబు, గొంతునొప్పి, కళ్లు ఎర్రబడడం, నుదుటిపై ఎర్రని మచ్చలు వస్తాయి. వైద్యుడి సలహాలతో మందులు వాడాలి. వ్యాధి సోకిన వారి నుంచి పిల్లలను దూరంగా ఉంచాలి. ముందస్తుగా వ్యాక్సిన్ వేయించడం మంచిది.

అప్రమత్తంగా ఉండాలి



వేసవిలో వడదెబ్బకు గురికావడంతో పాటు అనేక వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది. అప్రమత్తంగా ఉంటూ ముందస్తు జాగ్రత్తలు పాటించాలి. వీలైనంతవరకు ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు వెళ్లకపోవడమే మంచిది. బయటకు వెళ్లే వారు టోపీ ధరించాలి. వెంట గొడుగు, తాగు నీరు తీసుకువెళ్లాలి. నూనె ఎక్కువగా వాడే వంటకాలను తినకూడదు. ఎక్కువగా నీరు, ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవాలి. సబ్‌సెంటర్ స్థాయిలో జింక్ ట్యాబ్‌లెట్లు ఇస్తున్నాం. అవి తీసుకోవడం మంచిది.

–సంధ్య, పీహెచ్‌సీ వైద్యాధికారి, గుడిపాల

క్షయవ్యాధి నిర్మూలనకు కృషి చేద్దాం


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

బంగారుపాళెం: క్షయవ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేద్దామని బంగారుపాళెం ప్రభుత్వ ఆస్పత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ శిరీష అన్నారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మండల కేంద్రంలో వైద్య సిబ్బంది, క్షయ నివారణ కార్యాలయ సిబ్బంది, ఎస్టీ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, క్షయ వ్యాధి ప్రమాదకరమైన వ్యాధి కాదని అన్నారు. రెండు వారాలపై పొడి దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, గళ్ల పడడం వంటి లక్షణాలు ఉంటే సమీపంలోని వైద్యులను సంప్రదించాలన్నారు. టీబీ సూపర్‌వైజర్ శివకుమార్ మాట్లాడుతూ, రెండు వారాలకు మించి దగ్గు, జ్వరము ఉంటే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి గళ్ల పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్షయవ్యాధికి ఉచితంగా మందులు అందిస్తారన్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి క్షయవ్యాధికి ప్రత్యేక చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు. జబ్బు బారిన పడిన వారికి పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ పేదలు ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా అందిస్తున్న ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు శాలిని, జ్యోతిస్వరూప్, అఖిల్, డీపీఎంఓ మణి, హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు


మాట్లాడుతున్న సూపర్‌వైజర్

గుడిపాల: అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ స్వర్ణలత పేర్కొన్నారు. శ్రీరంగంపల్లె జెడ్పీ హైస్కూల్‌లో శనివారం పోషణ్ భీ, పడాయి(చదువు) భీ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు జరిగే శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా పిల్లలకు విద్యాబుద్ధులతో పాటు పౌష్టికాహారం, గర్భిణులు, తల్లుల సంరక్షణ చూడాలని వివరించారు. మూడేళ్లలోపు పిల్లలకు, 3 నుంచి 8 ఏళ్ల పిల్లలకు పోషకాహారం, విద్య గురించి అంగన్‌వాడీ కేంద్రాల్లో తీసుకోవాల్సిన చర్యలు, పిల్లల నైపుణ్యతను పెంచుకోవడానికి, దివ్యాంగుల పిల్లలను ఎలా గుర్తించాలి, పిల్లల పెరుగుదలకు చేపట్టాల్సిన సూచనలు, సలహాలు ఇచ్చారు.

నిబంధనలు పాటించాలి

బంగారుపాళెం: వాహనదారులు నిబంధనలు పాటించాలని సీఐ శ్రీనివాసులు అన్నారు. మండల కేంద్రంలోనివారపు సంతలో శనివారం రహదారి నిబంధనలపై అవగాహన కల్పించారు. వాహనదారులు రహదారిపై ఎక్కడపడితే అక్కడ వాహనాలు పార్కుచేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారని చెప్పారు. దీంతో పాదచారులు, ఇతర వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోందన్నారు. క్రమపద్ధతిలో వాహనాలు పార్కుచేయాలని సూచించారు. రహదారి నిబంధనలు పాటించాలన్నారు. సంతలో దొంగల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రామచంద్రారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


రోడ్డుపై ఆపిన వాహనాన్ని పక్కకు తీయాలని సూచిస్తున్న సీఐ శ్రీనివాసులు

బైక్‌ను ఢీకొట్టిన కారు

గుడిపాల: రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు కాగా మరొకరికి స్వల్ప గాయాలు అయినట్లు గుడిపాల ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గుడిపాల మండలంలోని చెన్నై- బెంగుళూరు జాతీయ రహదారిలోని గట్రాళ్లమిట్ట వద్ద శనివారం ఉదయం వేలూరు జిల్లా అయ్యగౌండనూర్ గ్రామానికి చెందిన శేఖర్ , సర్గునేష్ ఇద్దరూ పెయింట్ పనిచేసేందుకు ద్విచక్ర వాహనంలో వస్తుండగా చిత్తూరు నుంచి చెన్నై వైపు వెళ్తున్న కారు ఢీ కొనింది. ఈ ప్రమాదంలో సర్గునేస్ తీవ్రంగా గాయపడ్డాడు. శేఖర్ స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. వెంటనే చికిత్స నిమిత్తం స్థానికులు చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఆగి ఉన్న కంటైనర్‌ను ఢీకొన్న కారు


ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు

తవణంపల్లె: ఆగి ఉన్న కంటైనర్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో దంపతులకు గాయాలైనట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. మండలంలోని జాతీయరహదారిపై నయారా పెట్రోల్ బంకు వద్ద తిరుపతి నుంచి బెంగళూరుకు వెళుతున్న కారు, ఆగి ఉన్న కంటైనర్‌ను ఢీకొంది. ప్రమాదంలో కారు డ్రైవింగ్ చేస్తున్న కిషన్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. భార్య మానసకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని వెంటనే 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కిషన్‌కుమార్‌కు మెరుగైన వైద్యం కోసం వేలూరులోని నరువి హాస్పిటల్‌కు తరలించినట్లు వివరించారు.

నీటి సంరక్షణ అందరి బాధ్యత


ఇంకుడు గుంత వద్ద విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయ ఆవరణలో ఇంకుడు గుంతను ఏర్పాటు చేశారు. నీటి పొదుపు ఆవశ్యకతను శనివారం చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ తెలిపారు. రోజువారీ జీవితంలో నీటి పొదుపును పాటించాలన్నారు. నేడు మనం నీటి వృథాను అరికడితే రేపటి అవసరాలకు ఉపయోగపడుతుందన్నారు. వీలైనంత వరకు నివాసాల వద్ద ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకుంటే మంచిదని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు కేపీ శ్రీధర్, రాష్ట్ర మొదలియార్ విభాగం అధ్యక్షుడు జ్ఞానజగదీష్ నాయకులు మనోహర్, అంజలిరెడ్డి, హరీషారెడ్డి, సుగుణశేఖర్‌రెడ్డి, శివారెడ్డి, చామంతి, రాజేష్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి బొట్టును సంరక్షించుకోవాలి

గుడిపాల: ప్రతి నీటి బొట్టును సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందని ఎంపీడీవో శివరాజన్ తెలిపారు. జాతీయ జలదినోత్సవంలో భాగంగా శనివారం బంగారక్క చెరువులో నీటికుంటను శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు నీరు ఎంతో విలువైన వస్తువుగా మారిందన్నారు. ప్రకృతి ప్రసాదించిన దానిని కాపాడుకొని సంరక్షించడానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని చెప్పారు. రాబోవు రోజుల్లో నీటి కొరత రాకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈ పవన్, టెక్నకల్ అసిస్టెంట్‌లు చంద్ర, సుందరయ్య, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు పాల్గొన్నారు.

మండల సమావేశానికి అధికారుల డుమ్మా

చిత్తూరు రూరల్(కాణిపాకం): నగరంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి పలువురు అధికారులు డుమ్మా కొట్టారు. దీంతో సర్వసభ్య సమావేశం వెలవెలబోయింది. అధికారులు కూడా మండల సమావేశం ఉందన్న విషయం చాలా మందికి తెలియజేయడం లేదు. సమాచారం ఇవ్వకుండా ఎలా సమావేశాలకు హాజరు కావాలని పలువురు వాపోతున్నారు. సమావేశాలకు అధికారులు హాజరు కాకపోవడంపై ప్రజాప్రతినిధులు సైతం మండిపడుతున్నారు. వచ్చిన అధికారులతో జెడ్పీటీసీ ఎం.ఎస్‌బాబు నాయుడు, వైస్ ఎంపీపీలు జయరాం, రంజనీ కొన్ని సమస్యలను వెల్లడించి వాటిని పరిష్కరించేలా చూడాలని పేర్కొన్నారు.

నైపుణ్యాభివృద్ధి అవసరం


అంగన్‌వాడీ కార్యకర్తలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సూపర్‌వైజర్లు

బంగారుపాళెం: అంగన్‌వాడీ కార్యకర్తలు నైపుణ్యాభివృద్ధిని పెంపొందించుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ వాణిశ్రీదేవి సూచించారు. మండలంలోని మొగిలి మిట్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పోషణ భీ పడాయి భీ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాలను సుశిక్షితులైన కార్యకర్తలతో అభ్యసన కేంద్రాలుగా మార్చడానికి మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖ కృషి చేస్తోందన్నారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జయశ్రీ, రెడ్డికళ్యాణి, మొగిలి, చీకూరుపల్లె సెక్టార్ల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ వెళ్లి చెత్త సేకరించాలి

గుడిపాల: ప్రతి ఇంటికీ వెళ్లి తడి చెత్త, పొడి చెత్తను సేకరించాలని డివిజనల్ పంచాయతీ అధికారి రాజేశ్వరి తెలిపారు. బసవాపల్లె, 189 కొత్తపల్లెలో శనివారం తడి చెత్త, పొడి చెత్త ఉన్న కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి చెత్తను సేకరించి వాటిని ఎరువులుగా తయారుచేసి పంచాయతీల అభివృద్ధికి తోడ్పడాలన్నారు. గ్రామాల్లో ఎక్కడా కూడా చెత్త కనిపించకూడదని ఆదేశించారు. గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని చెప్పారు. వేసవి మొదలైన తరుణంలో తాగునీటికి ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని ఎంపీడీవో శివరాజన్‌కు ఆమె సూచించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ కృష్ణప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు కిరణ్, ఉదయ్, సర్పంచ్ పెరిల్లా పాల్గొన్నారు.


తడి చెత్త, పొడి చెత్త కేంద్రం వద్ద పంచాయతీ అధికారి రాజేశ్వరి

రైతు సేవా కేంద్రం తనిఖీ


రైతు సేవా కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న అబ్దుల్ షరీఫ్

యాదమరి: మండలంలోని కాశిరాళ్ల రైతు సేవా కేంద్రాన్ని శనివారం పశు సంవర్ధక శాఖ జిల్లా ఇన్‌చార్జి జాయింట్ డైరెక్టర్ అబ్దుల్ షరీఫ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సిబ్బందిని అడిగి పశు వైద్య సేవలను తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గాలి ద్వారా పశువులకు సంక్రమించే గాలికుంటు వ్యాధి చాలా ప్రమాదకరమన్నారు. దీనిపై సరైన అవగాహన కలిగించి రైతులను అప్రమత్తం చేయాలని సిబ్బందికి సూచించారు. నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకు టీకాలు తప్పక వేయించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఆయన వరదరాజులపల్లి, పత్రపల్లి రైతు సేవా కేంద్రాలను సందర్శించారు.